# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]
ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮. సంచిక ౩౦. | కాకినాడ:—శనివారము, ౨౩, జూలై, ౧౯౨౧. | చందా సం॥ రు ౩. విడిసంచిక అ ౧.

ఓమ్.

పితానోసి పితానో బోధి నమస్తేస్తు మామా హింసీః

## గమ్యస్థానము.

ఈశ్వరుడు జగన్నిర్మాత. సచ్చిదానందమయుడు. సకల కల్యాణగుణ సమన్వితుడు. ప్రపంచమును సృజించి తనయొక్క శుభలక్షణముల నన్నిటిని దానియందు నిలిపి మానవున కొక పాఠశాల నిర్మించినాడు. తనను చేరుటకై జీవితమనెడు దివ్యరథమును ప్రసాదించెను. మానవుడు ఈ పాఠశాలయందు విద్యాభ్యాసము చేసి తన గమ్యస్థానమును చేరుటలో తనకు సహాయము చేయగలిగిన వస్తు పరికరములను సమకూర్చుకొనవలెను. ఈశ్వరుడు సకల కల్యాణగుణ సమన్వితుడు. అతని దరి చేరవలెనన్న నే కళంకమును మానవుని యందుండగూడదు. కళంకములను దూరము చేయగలిగిన సాధనలనే తాను చేయవలసి యున్నాడు. అనుక్షణమునందును దుర్లక్షణములు పరుగెత్తుకొని వచ్చుచునే యుండును. తన మానవత్వమునకు లక్షణములైన అల్పబుద్ధులు తనకు కలుగుచునే యుండును. వీనిని విసర్జించివేయుట సులభమైన పనిగాదు. అతి కఠినము. మానవ ప్రపంచములో నుండువాడు ఎప్పుడు తాను అంతరాత్మ ప్రబోధితుడై ధర్మసాధనను చేయబూనకొనెనో అప్పుడు ప్రథమమున లోకకంటకుడు కావలసి వచ్చును. బంధువులు దూరమగుదురు. మిత్రులు శత్రులగుదురు. సంఘము బహిష్కరించును. లోకులు నిందింతురు. పరిహసింతురు. హృదయము చింతాకులమై పోవును. దడదడ కొట్టుకొనును. ఛిల్లును. ఇదే కఠినావస్థ. ఈ స్థితిలోనుండి తప్పించుకొనుటలోనే యున్నది. మానవుని శక్తి యంతయు. పరమపురుషుని చేరవలెనని సంకల్పము దృఢముగా నుండెనేని దుర్జయబలముతో ప్రవర్తించి నిరంతరము విశ్వాసముతోను ధైర్యముతోను ముందుకు సాగును. భౌతిక ప్రపంచమును వదలి ఆధ్యాత్మిక ప్రపంచమున విహారము చేయుటకు మొదలిడును. తాను తనలో నుండెడు అహంకారమును నిర్మూలము చేయుటలో మహా చక్రవర్తివలె సంచరించి శత్రుగణమును నాశనము చేయుట కారంభించును. ప్రపంచ సుఖములను వాంఛించుటలో అడుగుటకు గాని పొందుటకు గాని అస్వాతంత్ర్యుడై కలిగిన దానితో సంతుష్టుడై అధికమును కోరని, బానిస, నిర్బంధితుని వలె సంచరించును. నిత్యసంతోషితుడై నిష్కపటుడై యుండుటలో మాయలేని పసిబిడ్డవలె నుండుటకు మొదలిడును. ఇతరులు చేసిన అపరాధములను మన్నించుటలో తప్పుచేసినను తిరిగి ప్రేమించుటలో జాలి చూపుటలో ప్రేమ జూపుటలో, సదయ హృదయుడైన నారికేళము ననుకరించును. ఘోరారణ్య మధ్యమున నిబిడాంధకారమున వినవచ్చు భయకంపితములైన ప్రతిధ్వనులకు జంకక యుండునట్టి, సింహమువలెను, దేనిచేతను బంధింపబడక యెట్టి మలినముల చేతను మైలపడక, స్వాతంత్ర్యముతో విహరించు మందమారుతము వలెను, కుళ్లునీటిలో నుండినను పరిశుభ్రముగా నుండి చూపరుల దృష్టికి ఆనందమును కలుగజేయు తామర పూవువలెను, సంచరించి తన పరమ నిధానమైన పరంధాముని చేరును. ఇట్లు సంచరించిననే మానవులు తమ గమ్యస్థానమును చేరగలుగుదురు.

త. న. శ.

---

# సారా వ్యాపారము.

—:০০০:—

(దుగ్గిరాల సూర్యప్రకాశరావు పంతులుగారు, బి. ఏ.)

ఆ సేతు హిమాచల పర్యంతము ప్రస్తుత మద్యపాన వ్యాపారమువలన భరతఖండమునకు వాటిల్లిన యనర్థమును గుర్తించి దాని నివారణమునకు న్యాయప్రయత్నములను చేయనివారు కానరారు. మధుపాన నివారణమునకు దొరతనమువారు సంకల్పించిన విధానములన్నియు, కాముకుల విరహోగ్రప్రశమనమున కీయబడు మందులన్నియు దానికి విందులయ్యెనని కవులు ప్రబంధములందు వర్ణించినరీతిని, వారి యాదాయాభివృద్ధికి సాధనభూతములయ్యె గాని త్రాగుడుతగ్గుట కుపయోగింపలేదు. ఇట్టి స్థితిని వారు నాశ్చర్యమగ్నులగుచున్నారు. శ్రమలేకుండ నేఁటేట నాబ్కారీ యాదాయము వృద్ధియగుచుండ దానిని చేజారవిడుచుటకు దొరతనము వారైన తలపోయుట యసంభవము. ప్రజలు వివేకమహితులై త్రాగుటను మానిరేని వారికి సంతోషమే! పోటీలమీద దుకాణములను పాడి భ్రష్టులు గాకుండ ప్రజలు ప్రాజ్ఞులై యుండిరేని వారికది సంతోషవిషయమే! దుకాణముల సంఖ్యను తగ్గించి త్రాగుట కవకాశములను దొలగింపుడన్న వారందుల కియ్యకొనిరి. వేతనాభివృద్ధి నపేక్షించు కొందరు క్రింది యుద్యోగియులు కల్లు సారా నల్లమందు దుకాణముల పాటలలో తాము రాబడి వృద్ధిని చూపకున్న తమకు మాట దక్కదని దురభిప్రాయులై పాటదారులను ప్రోత్సాహపరచి యెక్కువగ గడించి మెప్పును పొందుచుందురు. ఆబ్కారీ పాటల సమయములందు డిపార్టుమెంటు ఉద్యోగియులందరు సమావేశులై యభిమానము వెల్లడించి గతవత్సరపు రాబడికన్న తగ్గిపోకుండ కట్టుదిట్టముల నేర్పరుప యత్నించుటవలన, వారు దొరతనమువారి సంకల్పమునకు బుద్ధిపూర్వకముగ విఘ్నము గావించుచున్నారనక తప్పదు. లంకల పాటలవలెనే ఆబ్కారీ పాటలు నిష్టాపూర్వకములైనచో కడు ప్రమాద ముండబోదు.

త్రాగుడును మాన్పించి దేశప్రజలను పశుత్వమునుండి మనుష్యత్వమునకు మరలించుటకు హిందూ మహమ్మదీయ క్రైస్తవ మతనాయకులొక్కటి దీక్షవహించి యున్నారు. వారియత్నములకు భగవంతుడు తోడ్పడుచున్నాడు. సారాయి వర్తకమువలన ధనికులై విస్తారలాభముల నందుచున్న యూరపియన్ వర్తక సంఘములవారు తప్ప మిగిలినవారందరు మధుపాన వ్యాపార వినాశమునకు బద్ధకంకణులై యున్నారు. యావద్భారత దేశీయ మహాసభవారు, రాష్ట్రీయసభలవారు, మండలసభలవారు, సంఘసంస్కరణ సభలవారు, సహాయనిరాకరణోద్యమము వారు, ఇస్లామియాసమితులవారు, క్రైస్తవ మతబోధ సంఘములవారు సమానసంకల్పోద్దేశములతో పాటుపడుచున్న విషయములం దిది యగ్రగణ్యమై యున్నది. దివాన్ బహద్దరు మోచర్ల రామచంద్రరావు పంతులుగారు ప్రవేశపెట్టదలచిన మధుపాన నిషేధనశాసనమందు విదేశీయ సారావిక్రయ నిషేధమున కేర్పాటు లేకయుండుట గొప్ప లోపమని మొదట చెప్పినవారు మిస్ నెకేలు. హిందూదేశము స్వరాజ్య సంపాదనమునకు కర్హత బడయుటకు నావశ్యసోపానములలో మధుపాన బహిష్కార మొకటి యని మహాత్మా గాంధి నిరూపించి యున్నాడు. దీనివలన దేశమున కెంతయోన క్షేమము గల్గునని దొరతనమువారి ప్రచురణశాఖవారు తమ (15:) సంఖ్యగల ప్రచురణమున దెల్పియున్నారు. తమ పట్టణములో కల్లు సారా యంగళ్ళను పూర్తిగ నెత్తివేయుటకు సమయము వచ్చినదని పురపాలక సంఘములవారు కొన్నిచోట్ల నేకగ్రీవముగను, కొన్నిచోట్ల బహుసభ్యాభిప్రాయముగను తీర్మానించుట కారంభించిరి. త్వరితముగనో ఆలస్యముగనో ఆబ్కారీయాదాయము విడనాడుకొనవలసిన పద్దులలో చేర్చదగినదని యార్థిక సంబంధసంఘమువారు విస్పష్టముగ నిరూపించియున్నారు. జిల్లా బోర్డులవారింకను సాహసించి తమ యభిప్రాయమును తెలుపజాలకున్నను తాలూకా బోర్డువారలచ్చటచ్చట తమ యనంగీకారమును విస్ఫుటము గావించుచున్నారు. ఏవిధముగ జూచినను, వ్యవహారము సుముఖముగ నున్నది. ప్రస్తుతము దేశమునందారంభమయిన సక్రమాందోళనమున, సత్ఫలము బోయి చూచువారికి సుస్పష్టముగ ద్యోతకమగునది క్రిందిజాతులవారికి త్రాగుడుపట్లగలిగిన యసహ్యమే. అనేకచోట్ల మాలమాదిగలు తాము, లోకమట్టిటులైనను ముందునుండి త్రాగువారము కామని ఘోరశపథములు గైకొని కులతప్పుల నిర్ణయించుకొని దీక్షాగతులై యున్నారు. రెయిల్వేస్టేషనులు, పడవలరేవులు, వర్తకుల కొట్లవద్ద పనిచేయు కూలివాండ్రు తాము ప్రత్యేక సంఘములుగ జేరి సారాయములను ముట్టమని ప్రతిజ్ఞ గావించుకొనిరి. ఇవన్నియు సుముఖములు; శుభదాయకములు. కాని యెదురుగ బెల్లముముక్క నిలిచి తనను ప్రతివారు కొరికి నములుచున్నారని సృష్టికర్తతో మొఱ్ఱపెట్టుకొన బోగా తననును నోరూరుచున్నది గాన, దూరముగ బోయి కంటికి కనబడవద్దని బ్రహ్మ బెల్లముతో చెప్పెనని మనలో కథగలదు. ఎన్ని కట్టుదిట్టముల నేర్పరచి ఎన్ని శపథములు పట్టి, ఎన్ని గంభీరోపన్యాసములను మహావక్తలిచ్చినను, ఒక్క పెద్దగస్తా పొడవున దొరతనమువారి యనుమతిని స్థాపింపబడిన సారా దుకాణములుండగా, అలవాటు పడినవారు కక్కుర్తి పడకుండుటకు గొప్ప మనోబలము సంఘభయము నుండవలెను. లేదా త్రాగుట కవకాశము లేకుండవలెను. అందుబాటుగా, ఇంట డబ్బాలతో పంచదారనుంచి కడుపున నులిపురుగు పట్టిన బాలుని పంచదార తినవద్దని బోధించు తండ్రివలె దుకాణముల నందుబాటు గావించి, యందు నిలుపవలసిన సారా మొత్తమును తగ్గింపక, ప్రజలు బుద్ధిగానుండుట, వారు మధుపాన విముఖులగుట తమకును సంతోషావహమేయను మాట కర్థము లేదు. వేశ్యలు వివాహబంధమున కంగీకరించి సంసారము చేయుచుండిరేని వారిలో వ్యభిచారము తగ్గును గాని, పందిపిల్లలను ఎరకలవాండ్రు పెంచినట్లు, రూపాయను రెండు రూపాయలకు పసి బాలికలను కొని వ్యభిచారము కొరకు పెంచెడు వేశ్యవాటికలలో గుడిసెవేటుతనము తగ్గగలదా? కావున దుకాణముల సంఖ్య తగ్గించిన మాత్రాన త్రాగుబోతుతనము తగ్గదు; సుప్రసిద్ధ దేశభక్తుల సద్బోధనల వలనను, సద్వక్తల మహోపన్యాసముల మూలమునను తగ్గదు; కల్లు సారా విక్రయము

నను కాలపరిమితి తగ్గించినను ప్రయోజనము లేదు; దుకాణములను పురగ్రామ బాహ్యసీమలకు దొలగించినను లాభములేదు. కల్లు కొరకు గీచెడు చెట్లసంఖ్య తగ్గవలెను. డక్కెన్ షుగరు అబ్కారీ కంపెనీ వంటి వారు హద్దుపద్దులేనంత రమ్ము సారాయము తయారు చేయకుండునటుల వారిని నిర్బంధింపవలయును. ఒక్కసారి నిషేధించి త్రాగుడును మాన్పుటకు యత్నించుట యపేక్షణీయమని దలచువారిలో నేనొక్కడనైనను, ఆచరణమునందిది దుస్సాధ్యమని కనబడుచున్నది. దీనికి యునైటెడ్ స్టేట్సు దొరతనము వారి యాజ్ఞాభంగమే తార్కాణము. ప్రజలు దీక్ష వహించి పరిశీలించి, దౌర్జన్యరహిత బోధనమున కుద్యమించినప్పుడు నిషేధనోద్యమము వ్యర్థము కాజాలదు. ఆరంభమున కొన్ని నైసర్గికముగను కొన్ని యారోపితముగను కష్టములు నే కార్యములను వచ్చితీరును. దీనికి పూనా నాగపురము మొదలగు ప్రదేశములందలి పరిస్థితులే ప్రబలనిదర్శనములు. వేయేల కాకినాడలో కూలివాండ్రు నడుచు తాము కల్లుసారాయముల త్రాగమని శపథముపట్టి సారా యంగడులకు బోవుట మానగా దుకాణదారులు సహాయనిరాకరణ వాదుల బెదరింపుచేతను యమ్మకము తగ్గిపోవుచున్నదనియు సర్కారు కిస్తీలు క్రమముగా చెల్లకపోయిన యెడల తమ్ము బాధ్యులను చేయవద్దని నిరాధారమగు విన్నపము నధికారుల కంపినారు. పోలీసువారు విచారింపగా నది సత్యాబద్ధమని తెలియవచ్చెనట. త్రాగుడు పేరిట వ్యర్థమగుచున్న కోటానకోట్ల రూప్యములను భద్రపరుపగలిగిన యెడలను, బట్టలకొరకు విదేశముల కేగుచున్న లక్షలను నిచట నిల్పజాలిన యెడలను, పదేండ్లలో మన దేశపు ప్రజలందరు రెండుపూటల తినుట కన్నము కలిగి, బ్రిటిషు సామ్రాజ్యములోని యితరభాగముల ప్రజలవలె స్వతంత్ర గౌరవములు పొంది తాము సత్కార్యార్హుల మనిపించుకొనగలిగిన స్థితిలోనికి రాగలరనుటకు సందియమెంత మాత్రము లేదు.

## ధర్మవర మాధ్యమిక పాఠశాల—పంచములు.

ధర్మవర మాధ్యమిక పాఠశాలలో బంచములు చేరిన విషయమై కొందఱు తిరస్కరించుట నెఱిగి, అనంతపురము డిస్ట్రిక్టు బోర్డు ప్రెసిడెంటు మ|| రా|| రా|| శ్రీ దివాన్ బహదూరు పట్టి కేశవ పిళ్ళెగారీ (౧౯౨౧ వ జూలై) నెల ౭ వ తేది మధ్యాహ్నమున ధర్మవరమునకు వచ్చి, యందలి ట్రావెలర్సు బంగళాలో దిగిరి. పౌరులు కొందఱు వారిని జూచుటకై విడిదికి వెళ్ళియుండిరి. మ|| రా|| రా|| శ్రీ టి. శివశంకరము (M. L. C.) గారు సమభావమును గూర్చి సాదృశ్య పూర్వకముగ నుపన్యసించుచు బంచములను విద్యాలయముల యందు గూడ నిరాకరించుట భావ్యము కాదని తెలిపిరి. పిమ్మట కేశవ పిళ్ళెగారు, 'మేము ప్రభుత్వపు ఉత్తరువును బట్టి పంచముల నా పాఠశాలలో జేర్చితిమనియు దదాజ్ఞ నుల్లంఘింప జాలమనియు బంచమ విద్యార్థులు మీతో సమానముగ విద్యార్జనము సేయుట మీకిష్టము లేనియెడల—మీరు మీ బాలకుల నా పాఠశాలకు బంపని యెడల—కొన్ని దినములు చూచి దానిని దీసివైచి, విద్యాసక్తి గల మఱియొక చోటికి నుపాధ్యాయ వర్గమును మార్చి యందీ నియమములపై నీ పాఠశాలను నెలకొల్ప నిశ్చయించితిమి' మనియు దెలిపిరి.

ధర్మవర విలేఖరి.

## సమాచారము.

:o:

బందరులో ఈనెల ౩, ౪, ౫ తేదీలయందు శుద్ధ స్వదేశి సంత జరిగినది. సుమారు ౧౬౦౦౦ రూప్యముల సరకు అమ్మకమయినదట.

మే ౨౧ వ తేదికి ఆంధ్రదేశములో ౧౦౦ గ్రామములలో మద్యము నిషేధింపబడెనని తెలియుచున్నది.

తన స్వాతంత్ర్యమును అంగీకరించి వర్తక సంబంధమగు ఆనుకూల్యముల కలుగజేయుటకు ఆఫ్ఘన్ స్థానము తన రాయబారులను ప్రపంచములోని సర్వరాజ్యములకు పంపుచున్నది. రష్యా, జర్మని, మొ|| దేశములు సమ్మతి తెలిపినవి. రాయబారులు ఇప్పుడు అమెరికాలో నున్నారు.

విదేశవస్త్ర బహిష్కరణమునందు, మద్యపాన నిషేధమునందు తోడ్పడవలయునని హిందూదేశములో నున్న ప్రతి ఆంగ్లేయుని గాంధి మహాత్ముడు హెచ్చరించుచున్నాడు.

రాబోవు సామ్రాజ్య శాసన సభ సిమ్లాలో సెప్టెంబరు ౧ వ తేదిని జరుగును.

ఐర్లండు సమస్య తీర్చుటకు ఒక సభ లండనులో జరుగును. ముందుగ ఐర్లండు నాయకుడు డివెలేరా గారికిని, లాయిడు జార్జి గారికిని జూలై ౧౪ తేదిని ఒక రహస్య సంభాషణ జరిగెను.

హిందూదేశమును దర్శించిన పిదప, తమ దేశమునకు రమ్మని జపానువారు ఆంగ్ల యువరాజు గారిని ఆహ్వానించిరి.

రవీంద్రనాథ ఠాకూరుగారు గత శనివారము నాడు బొంబాయి రేవులో దిగిరి.

బొంబాయి రాజధానిలో నిర్బంధ ప్రాథమిక విద్య నేర్పరచుటకు పరాంజపె గారు ఆలోచించుచున్నట్లు తెలియుచున్నది.

యాకుబ్ హుసేన్ గారు విధింపబడిన ౬ మాసములలో ౫ మాసములు శిక్ష ననుభవించిరి. చెరసాలలో కలరా ప్రబలినది. మలబారు వెళ్ళనని వాగ్దానము చేసినచో విముక్తులచేసెదమని దొరతనమువారు తెలుపగా తమ శరీరము అస్వస్థతగా నుండుటచే వలసిన వాగ్దానము చేసి యాకుబ్ హుసేన్ గారు బయటికి వచ్చిరి. కోయంబత్తూరులో ౨౦౦౦ మంది వారికి స్వాగత మొసంగి సభ జరపిరి. కాంగ్రెసు సభ్యులగుటకు సభ్యులను వారు హెచ్చరించిరి.

బొంబాయిలో జూలై ౧౬ వ తేదికి ౭ గురు వర్తకులు విదేశపు గుడ్డలు తెప్పింపమని ప్రతిజ్ఞ తీసికొనిరి. ఇతరులనేకులు కొత్త ఆర్డరు ఇయ్యకయు, పాత ఆర్డరు రద్దుపరచుకొనియు ఉద్యమమున పాల్గొనుచున్నారు.

తిలక్ వార్షికోత్సవ దినమున (ఆగస్టు ౧ వ తేది) దేశములో నెచటను హరతాళము జరుపుట భావ్యము గాదని గాంధి మహాత్ముడు చెప్పుచున్నాడు.

ఆంగ్ల యువరాజు గారి ఆగమనము ప్రస్తుతము నిలుపబడునని వదంతి బయలు దేరినది.

సత్యమేవ జయతే

దేశసాధని

శనివారము, జూలై ౨౩, ౧౯౨౧.

# లోకమాన్య తిలక్ వర్ధంతి.

—:౦౦౦:—

ఆగస్టు ౧ వ తేదిన లోకమాన్య బాలగంగాధర తిలక్ వర్ధంతి భరతవర్షమునం దంతటను జరపబడును. ఆ మహనీయుడు దేనికొరకు తన విద్యను శక్తిని సమస్తమును వినియోగించెనో, దేని నిమిత్తము తన జీవితమును బలిదానము గావించెనో ఆ దేశ స్వాతంత్ర్యము నేడు దేశీయు లెల్లరి మనంబుల తాండవమాడుచున్నది. ప్రపంచములోని దేశములన్నియు స్వాతంత్ర్యము కొరకు విసుగు విరామము లేక కృషి సల్పుచుండ, భారతీయులు మాత్రము ఆ ప్రయత్నమునకై యెట్లు పూనుకొనక యుండ గలరు? మిగిలిన దేశముల మాట యటుండ నిచ్చినను, బ్రిటిషు సామ్రాజ్యమునకు సంబంధించిన ఐర్లాండు, ఆఫ్ఘనిస్థానము, ఈజిప్టు దేశములు స్వాతంత్ర్యమునకై చూపు ఉత్సాహమైనను మన దేశీయులయందు స్వాతంత్ర్యేచ్ఛ నెట్టుల పెంపొందింపక యుండగలదు? స్వాతంత్ర్యమునందె సర్వాభివృద్ధులు ఇమిడి యున్నవనియు, స్వల్ప సంస్కరణములు బాహ్యాప శమనమునకు మాత్రము తోడ్పడునె గాని అంతరజీవనమును దృఢపరచి వర్ధిల్లజేయుటకు అసమర్థములనియు, దేశములో బహుసంఖ్యాకులు గ్రహించిరి. కాన, సంపూర్ణ స్వాతంత్ర్యమునె లక్ష్యముగా గల తిలకుని యెడ వారు గౌరవము చూపుచు అతని జ్ఞాపక చిహ్నముగా స్వరాజ్యము స్థాపనము చేయుటకు కోటి రూప్యములకు పైగా నిటీవలనె కానుకల నర్పించిరి. ఈ భూరిదానము దేశీయుల కార్యాతురతను సహితము వెల్లడించుచున్నది.

తిలకుని స్మరణదినమున ముఖ్యముగ మదిని నిలుపవలసినవి కార్యదీక్ష, త్యాగశీలము. సదూహలు గాని సద్వచనములు గాని కార్యరూపము దాల్చనంతవరకు నిర్జీవములు. వానియందు ఏ కళ, ఏ శోభ, ఏ వికాసము గాన్పింపదు. ఆలోచనలు, మాటలు కార్యమునందు ఆకారము పొంది తమ సౌందర్యముచే అన్యుల నాకర్షించి యుత్సాహ పూరితులచేసి చరితార్థత నొందుచున్నవి. కార్యదీక్ష లేకపోయిన తరువాత, ఎన్ని మంచిగుణము లున్నను, అవి యన్నియు నిరుపయోగములు. తిలకుని కార్య విధానము నామోదించుటకు కొందరకు అభ్యంతర ముండిన నుండవచ్చును. కాని యాతని కార్యదీక్ష యెల్లరి స్తోత్రమునకు పాత్రమె. తన విశ్వాసము ననుసరించి జీవించుటకు ఎన్ని కష్టముల నైన నెదుర్కొనెను, ప్రపంచ సుఖము లన్నియు విడనాడెను, తన శక్తి సామర్థ్యములన్నియు దేశమాతకు అర్పించెను. దేశీయుల పరిహాసములు గాని, అధికారుల బెదరింపులు గాని, కారాగృహముల బాధలు గాని అతనిని కార్య విముఖుని చేయజాలకుండెను. ఉన్నత పట్ట పరీక్షలయందు తేరి సంస్కృతమునందు మహా విద్వాంసుడయి, తన జ్ఞాన విశేషమును ప్రదర్శించి జనుల మెప్పు బడయుచు స్వోన్నతికి పాటుపడ మంచి యవకాశములు కలిగియు అవి యేవియు నాశింపక సంపూర్ణ స్వార్థత్యాగముతో దేశసేవ సల్పి ధన్యుడయ్యెను. లోకమాన్యుని కార్యదీక్ష, త్యాగశీలము దేశీయులను కార్య శూరత్వమునకు, స్వార్థ త్యాగమునకు పురిగొల్పును గాక!

స్వాతంత్ర్యాభిలాష దేశీయులలో నెంత యతిశయిల్లినను అతిశయిల్లవలసినదె. కాని తాము స్వాతంత్ర్యము గోరుచు, నిమ్నజాతుల స్వాతంత్ర్యము మన్నింపని, స్త్రీల స్వాతంత్ర్యమును సహింపని దేశాభిమానుల మూలమునను, స్వరాజ్య స్థాపనమునకు ధర్మము, ప్రేమ, అహింస గాక దౌర్జన్యము, ద్వేషము, క్రౌర్యము సాధనములుగా చూపుచు ప్రయోగించుచు వచ్చిన ఆందోళకుల మూలమునను, రాజకీయోద్యమము ఇంతవరకు సాత్వికుల, ధర్మతత్పరుల దృష్టియందు గర్హితముగ నుండెను. తిలకుని ప్రబోధమునందు శాంతము ధర్మము ప్రాముఖ్యత వహిం

పలేదు. గాంధి మహాత్ముడు రాజకీయోద్యమమును శాంతిబద్ధము, ధర్మబద్ధము గావించి పవిత్రపరచి యున్నాడు. లోకమాన్యుని నుండి గ్రహింపబడిన కార్యోత్సాహము మహాత్ముని యుపదేశాను సారము శాంతి పద్ధతుల, ధర్మమార్గముల ననుసరించి భరతవర్షమునకే గాక ప్రపంచమునకును కల్యాణ ప్రదమగు గాక.

---

ఆంధ్రసాహిత్య పరిషత్తు:—

దశమ వార్షిక సభ ఈ జూలై ది 30, 31 తేదులను అగష్టు ది ౧ వ తేదిని ఏలూరులో జరుపబడును. కార్యక్రమము మున్నగునవి ముందు క్రమముగా దెలుపబడును.

---

ఆంధ్రవాణి:—

బరంపురమునందు ఆంధ్రవాణి తిరిగి ప్రచురింపబడుచున్నది. జూలై ౧౬ వ తేది సంచిక మాకందినది. సహాయనిరాకరణోద్యమ పక్షము వహించి పత్రిక పాటుపడును. ప్రతి శనివారము వెలువడును. చందా రు ౪-౦-౦.

---

# సమయోచితమగు హెచ్చరిక.

—:oOo:—

ధర్మవరమునందు పంచములు పాఠశాలలో జేరు విషయమున పెద్ద తగాదా జరగుచున్నది. ఆ గ్రామవాసులు కీర్తిశేషులయిన శ్రీమాన్ టి. ఎన్. వెంకటస్వామి నాయుడుగారి చిత్రపట ప్రదర్శనోత్సవము మండల కరగ్రాహుల యధ్యక్షతక్రింద నిటీవల జరపిరి. ఉత్సవ వృత్తాంతము మాకొక విలేఖరి పంపెను. తత్సమయమున టి. శివశంకరము ఎమ్ ఎల్ సి గారు గావించిన ప్రసంగములోని యీ క్రింది విషయము మిక్కిలి సమయోచితముగ నున్నది. పంచములను పాఠశాలలోనికి కూడ రానియ్యక మనము వారియెడ గావించు నుపకార మేదో యూహించుట దుర్లభము.

"శ్రీ నాయుడుగారి సత్ప్రవర్తనమున కాధారమైనది సర్వసమభావము. వీరి సుగుణము నందా వేశిమి చాల హెచ్చుగా నుండెను. భారత భాగవతాద్యుద్గ్రంథములయం దట్టి మెరుక గల పురుషుల చరితలు పెక్కిట్టిని మనము చదివియే యున్నాము. రంతి దేవుడను రాజర్షి సమభావమున కాదర్శమూర్తులగు మహానీయులలో నొక్కడు. శ్రీ వేంకటస్వామినాయుడుగా రైశ్వర్య సంపన్నులయ్యు, నున్నతపదవి రాజితులయ్యు, దిక్కుదరిలేని దీనుల జూచి యనుతాపించిరి. పంచముల యధోగతికై చింతించిరి. వారి కొరకు దమ జీవితమును ధారపోసిరి. నాయుడుగారి సమతకొక్క సాదృశ్యమును మాత్ర మిట జూపెదను. వీరు డిప్యూటీ కలెక్టరుగా నున్న కాలమున, జమాబందుకై మడకసిరాకు వెళ్ళియున్న తరుణమున, నచ్చటి పంచములలో నుత్తమ పురుషు డెవ్వడని విచారించి, యాతని యింటికి నడచిపోయి, యతనితో జాలసేపు సంభాషించిరి. ఆ పంచమ సోదరుడు 'భూతప్ప' యను పేరుగల సద్గుణాలంకారుడు. నాయుడుగారు భూతప్పను ధర్మవరమున కాహ్వానించి, నిజ మందిరమున బ్రాహ్మణోత్తమున కుపచారముల నాచరించి, తన వెండి పళ్లెరములలో నాతని కాతిథ్యము నొసగి, సత్కరించిరి. అతని నిందలి మాదిగ కూటమునకు గొనిపోయి, యచ్చటి జనుల కాతని చారిత్రము వినిపించి, వారి పురోభివృద్ధికి దాని నాదర్శముగ నుంచుకొన నాజనుల బ్రోత్సహించుటయే గాక, యనేకులకు బహువిధ ప్రయత్నములు గావించి తోడుపడిరి. నాయుడుగారికి నిమ్నజాత్యుద్ధరణ విషయమున మించిన పట్టుదల యుండెను. అదియే వారి సమభావమున కలంకార ప్రాయమయ్యెను. నేడీ యూర నొక మహాసంకటము సంప్రాప్తమయినది. అది యనేకుల నాతురత్వమున గలవరపఱచుచున్నట్లు గ్రహించితిని. ఈపుర మాధ్యమిక పాఠశాలలో బంచమ బాలకులు విద్యార్థులై ప్రవేశించిరి. అది కారణముగా దలిదండ్రులు పెక్కురు వారి బిడ్డలను పాఠశాల కనుపక మానిరి. శ్రీ వేంకటస్వామి నాయుడుగారు నేడు జీవించియే యున్నచో, బంచమ బాలకులు చేరిన యీబడికి దమ బిడ్డల నంపక నిరాకరించి యుండుదురా చెప్పుడు?—తప్పక బంపియుందురని మీరు సంభావించుచున్నారు కదా? అట్లయినచో వారి స్మరణార్థమయి మీరును మీమీ బాలకులను నేటి నుండియే యీ పాఠశాలకు బంపుడు. అదియే నాయుడుగారికి మీరు చూపవలసిన కృతజ్ఞత. అప్పుడే శ్రీ వేంకటస్వామి నాయుడుగారి పౌశీల్యము మీరు నిజముగ గౌరవించిన వారలగుదురు. నేడు మీ రిట్లు వారి చిత్రపటమును నారాధించినందులకు గుఱుతు, శ్రీవారి గుణోత్కర్షమును మీలో నలవఱచుకొన బ్రయత్నించుటే కదా? అందులకు మీరు మీ కుమారవర్గమును నిశ్శంక భావమున నా పాఠశాలకు బంపుట ప్రథమ భూమిక యగు గాక!

---

# శుద్ధస్వదేశీ సంత.

---:o:---

మచిలీపట్టణము.

జూలై 30, 31 తేదీలయందు బందరు పుర మందిరమందు జరుగును.

ఆగష్టు 1వ తేదినుండి ప్రతి మనిషియు, కనీసము బహిరంగముగ ధరించు దుస్తులైనను శుద్ధస్వదేశివిగా నుండవలెనని శ్రీ గాంధిమహాత్ముడాదేశించి యున్నాడు. అందుచే ఈ నియమమును ననుష్ఠింపదలచి వారికి నెలాఖరులోగా శుద్ధస్వదేశీ వస్త్రములు లభింపజేయవలయుననుదలంపున జూలై ౩౦, ౩౧ తేదీలయందు సంత నేర్పాటు చేసియున్నాము. దేశీయులందరు ఈ తరుణమును వినియోగించుకొందురుగాత.

జూలై ౩, ౪, ౫ తారీఖులయందు జరిగిన సంతకు సు ౨౦ వేల రూప్యముల సరుకు వచ్చినది. వచ్చిన సరుకు విడుదలయయినది. ఏలూరు మొదలగు ప్రదేశములనుండి వర్తకులు వచ్చి సరుకు ఖరీదు చేసి యుండిరి.

ఈ సంతకు మొత్తముగ సరుకు విక్రయించు వర్తకులును, మొత్తముగ కొను వర్తకులును వివిధ ప్రదేశములనుండి వచ్చునటుల దెలియుచున్నది.

ఈ సంతకు అనేక విధములయిన వడుకునూలు వస్త్రములు, నూలు, వివిధములగు రాటములు, ఏకులు, దూది, కదుళ్ళు, కాంబోడియా ప్రత్తివిత్తులు, కొండపల్లి బొమ్మలు, రాటపుబొమ్మలు, చిత్రాసనములు హిందూదేశమందు తయారుచేసిన వివిధ వస్తువులు సమృద్ధిగా రానున్నవి. సుమారు ౮౦ వేల రూప్యముల సరుకు రాగలదని యంచనా వేయుచున్నాము.

స్త్రీలు ధరించు ౧౬, ౧౮ మూరల మేలికమ్మి చీరెలు, వితంతువులకు పనికివచ్చు ౧౬, ౧౮ మూరల ధోవతులు, గజము ఆరు వీసముల వెడల్పుగల ధోవతులు దీసికొని రావలయునని వర్తకుల హెచ్చరించుచున్నాము.

(1) ఈ సంతయందు వస్త్రములయందు చేతితో రాటములు మీద దీసిన వడుకునూలుతో నేసిన వస్త్రములకును, నూలులో, చేతితో రాటములమీద దీసిన నూలుకు మాత్రమే స్థల మీయబడును. మిగిలిన వస్త్రములకు నూలుకు స్థల మీయబడదు. సబ్బులు, కలములు, కాగితములు, మొదలగు వస్తువులు హిందూదేశమందు తయారయినవిగ నుండవలయును.

(2) సంతయందు దుకాణములు పెట్టదలచిన వారలు జూలై ౨౫వ తేది సాయంత్రములోగా కమిటీ వారికి జేరునటుల యత్తరము వ్రాయుచు దానియందు విక్రయించు వస్తువుల వివరము, అమ్మువారి పేర్లు తెలుపవలయును. కమిటీవారు తమకు యుక్తమని దోచిన దుకాణ దారులకు మాత్రము స్థల మిచ్చెదరు. స్థల మీయబడని దుకాణ దారులకు కారణము దెలుపబడదు.

ఇట్లు,

కా. పెదబాలేందు శేఖరుడు, శ్రీ వ. సూర్యనారాయణరావు,
పు. సత్యనారాయణ, శ్రీ మ. లక్ష్మీనారాయణ గుప్త,
కొం. వీరభద్రాచార్యులు, శ్రీ క. శ్రీరామశాస్త్రి,
ము. కృష్ణారావు, శ్రీ భో. పట్టాభి సీతారామయ్య.

శుద్ధస్వదేశి సంతకమిటీ.

---

# గ్రంథాలయస్థాపన.

---:-o-:---


తిరుమలకప్పం.

చిత్తూరుజిల్లా నారాయణవరం శ్రీ హనుమద్గ్రంథాలయ శాఖ నొకటి తిరుమల కప్పం గ్రామమున 10-7-21 తేదిన నెలకొలుపు కొరకు ఆహ్వానింపబడిన మద్రాసు శాసననిర్మాణ సభాసభ్యులును, చిత్తూరు పురపాలక సంఘాధ్యక్షులును, చిత్తూరుమండలబోర్డు ఉపాధ్యక్షులును నగు మ॥ రా॥ శ్రీ బి. మునుస్వామి నాయుడుగారు బి. ఏ; బి. ఎల్. సదరు గ్రామ ప్రవేశమున పౌరులచే నెదుర్కొనబడి మేళతాళముల తోడను జండాలతోను హనుమాన్ సైనిక భటులతోడను విడిదికి గొంపోబడిరి. భాండాగార భవనము చిత్రవిచిత్ర జండాలచేతను పలువురు నాకర్షించిన రాట్నముల బాపుటాచేతను నలంకరింపబడెను. సభ ౨ వందలకు మించినందున యొక సొంపుగులుకు తోటయందు మధ్యాహ్నము ౩ ఘంటలకు ప్రారంభింపబడి మ॥ రా॥ శ్రీ సి. వి. రంగం శ్రేష్ఠిగారు అస్పృశ్యతోద్యమము మద్యపాన నిరసనము, రాట్నములు, భాండాగారాదుల యుపయోగములు మొదలు గాగల సందర్భముల గూర్చి యుపన్యసించిరి. తర్వాత అధ్యక్షులగు మునుస్వామి నాయుడుగారు ప్రకృత పరిస్థితుల ననుసరించి భాండాగారావశ్యకతను గూర్చియు యిట్టి భాండాగారములు చుట్టుపట్ల నెలకొల్పబడవలయుననియు విపులముగ నొక ఘంటకు మించి యుపన్యసించిన వెనుక భాండాగారము నెలకొలుపుటను జరుపబడెను.

ఇలంద్రం పట్టాభిరామయ్య శ్రేష్ఠి,
గౌరవ కార్యదర్శి.

---

## Wrist Watches.



రిష్టు వాచీ, లేక, చేతికి ధరించు గడియారము. మంచిరకము "సిలెండరు" వాచీ నిక్కెలు

| | |
|---|---|
| వెండిది 12" సైజు | రు. 6-8-0 |
| డిటో 10" సైజు చిన్నది | 9-0-0 |
| రాత్రులు చీకటిలోను కన్పించు "రేడియమ్" చేతి గడియారము | రు. 7-8-0 |
| డిటో లీవరు గడియారము 10 కెంపులు గలది | ,, 20-0-0 |
| డిటో 15 కెంపులు గల లీవరు రిష్టు వాచీ | ,, 25-0-0 |

## చలువ జోళ్లు.

——($)——

| | |
|---|---|
| నాలుగు అద్దములు గల మబ్బురంగు జోడు | రు. 6-8-0 |
| డిటో. రెండవ రకము | ,, 5-0-0 |
| డిటో. గ్లోల్డు ఫిల్ అద్దములు | ,, 7-0-0 |
| ప్రక్కలను "వల్కనైటు" బిళ్లలును మబ్బురంగు అద్దములును గల "లారెన్సు & మేయో" కంపెనీ వారి "Amulet" | ,, 7-8-0 |

క్యాటలాగులు పంపబడును.

వలయువారు:—

యం. హెచ్. రావు అండుసన్సు,

కాకినాడ. (అని వ్రాసికొనవలెను.)

## కేసరి—పత్రత్రయము.

### లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు ఋతుశూల, బహిష్ఠ కానుండుట, అకాల బహిష్ఠి, మైల జాస్తిగాను, తక్కువగాను పోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, మూత్రకావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీరుగ్మ వ్యాధులను కుదుర్చును. 24. మో రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విస్ఫోటక, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి సుఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సుల రు. 5 12అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్యసన్నిపాత జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహోష్ణ్యములను కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల,

ఎగ్మోర్, మదరాసు.

## P. SUBBA ROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

## పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీ వెంకటేశ పెరుమాళ్ళ సన్నిధి, తంజాపూరు.

18. కంఠశుద్ధిమాత్రలు:—ఈమాత్రలను మాయొక్క డైరక్షన్ ప్రకారం వుపయోగించిన యెడల గొంతుకట్టు, గొంతు కమ్మకొనియుండునది పోగొట్టును బహు ఆనందముగా పాడుటకు తగినమయిన ధ్వని నిచ్చును. సంగీత విద్వాంసులకున్ను, ప్రసంగము చేయువారలకున్ను, బడి ఉపాధ్యాయులకున్ను యిది నక అద్భుతమయిన ఔషధము. యెంత పాడినను, ప్రసంగము చేసినను, ధ్వని మార్పక యుండును. సీసా 1 కి అ 8, 1 మొదలు 6 సీసాలవరకు పంపుటకు వి. పి. శెలవు అణాలు 8 ప్రత్యేకము.

19. సుగంధ స్నానపొడి:—ఈ వాసన పొడిని ప్రతిదినము దేహమునకు చరిమి స్నానము చేసినయెడల దేహమునకు సుగంధ పరిమళమును యిచ్చుటయే గాక దురదవల్ల గోకడం, మూగగజ్జి, దేహము కంపుకొట్టుట, చేతులు, కాళ్లు, మంటలు, మేహవృష్ణమువల్ల కరపాణి, తలనొప్పి, మేహశీట, యింకను అనేక విధములయిన వ్యాధులను పోగొట్టి శరీరమును బంగారులాగున చేయును. మంచి వాసనను, లక్ష్మీకరమున్ను, ఆరోగ్యమును కలుగును. చేతిబిడ్డలకు కూడా వుపయోగించవచ్చును. వెల డబ్బి 1 కి అణాలు 8, వి. పి. శెలవు అణాలు 8 ప్రత్యేకము.

### బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి, చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధములయొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన క్రొత్తక్యాలండరు

విక్రయమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనే వ్రాసుకొనవలయును.

| లోమర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బీతో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫెర్రిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మద్రాసు.

శ్రీమాన్ వైద్యరత్న పండిత
డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము.

41, ఆచారప్పన్ వీధి, జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలురీతిగా మందులు విక్రయింపబడును. ప్లేగు, కలరా, ఇన్ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకును, తదితర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరములను వ్రాసిన, మందులు నిర్ణయించి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

ఎన్. మాధవమీనన్ (ఆయుర్వేదాచార్య)
తంతి విలాసము } డి. దేశికాచార్యులు,
'పండిట్', మదరాసు. } జాయింటు ప్రొప్రయిటర్లు.

## కేనోపనిషత్తు.

—:$:—

ఆంధ్ర పద్యకావ్యము.

శ్రీ ఆదిపూడి సోమనాధరావు కవి విరచితము.

ఈ క్రింది విలాసమునకు రు ౦-౧-౬ పోస్టు బిళ్లలు పంపిన, పుస్తకము పోస్టుద్వారా పంపబడును.

"ధర్మసాధని కార్యస్థానము"
కాకినాడ.



**Reg. No. M. 1094.**

**The Dharma Sadhani Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


V. P. Rs. As.

To M. R. Ry.

